



మన భారతదేశంలోని యెందరో అమాయక యువతులు యువకులను నమ్మి, వారి కపటప్రేమలో చిక్కి, మోసపోతున్నారు. యువకులు మోసపుచ్చి చేసే దురాచారాలకి ప్రతిఫలంగా, కొందరబలలు తమ ప్రాణాలనుకూడా కోల్పోతున్నారు. ఈలాంటి దురాచాలకి గురిఐన అమాయక యువతుల్లోనిదే కమల.

బురదలో తామరకమలంలా పుట్టింది "కమల" కోటయ్య బీదకుటుంబంలో. తాను బీదవాడైనా, కూతురికి విద్యాబుద్ధులు చెప్పించి, అల్లారుముద్దుగా పెంచాడు కమల తండ్రి—కోటయ్య.

కమల చాల అందగత్తె! అందానికి తగ్గ విద్య, విద్యకుతగ్గ వినయం, సద్గుణాలన్నీ ఆమెలో మూర్తీభవించినయి. ప్రస్తుత నాగరికతకు తానే మాత్రం తీసిపోకుండా తిరిగేది, కమల.

కమల సహపాఠి మోహన్. ఆమె ఆరితేరిన అందానికి ముగ్ధుడై ప్రేమించాడు. ఎన్నోసార్లు ఆమెను ప్రేమభిక్ష పెట్టమని కోరాడు, కాని "కమల" ఏలాంటి సమాధానం చెప్పకుండా, ఓ చిరునవ్వుతో వూరుకునేది.

కమల తన అంగీకారాన్ని తెలుపకున్నా, మోహన్ నిరాశజెందలేదు. ఆమె మందహాస గమనం అతని ఆశను మరింత బలపరిచింది. రాళ్లనైనా కరిగించే ప్రేమలేఖలెన్నో వ్రాసాడు. ప్రతిలేఖలో నిన్ను అగ్నిసాక్షిగా పెళ్లిజేసుకుంటానని నమ్మించాడు. మోహన్ నటించే అమాయకత్వాన్ని చూస్తుంటె కమల సున్నితహృదయం యెందుకో కరిగిపోయింది. అతను ఎన్నోసార్లు అక్షరాల వ్రాసినట్టు తనను పెళ్లిజేసుకుంటాడనుకొంది. "నన్ను నీదానిగానే భావించుకో మోహన్" అంది చివరికి సిగ్గుతో. మోహనుని ఆనందానికి అంతులేకపోయింది.

ఒకరోజు సాయంత్రం కమలా, మోహన్, ఇద్దరూ చెరువుగట్టునకు షికారుకని వెళ్లారు. పచ్చని పైరులు, జలజల పారే చిన్నకాలవలు, పున్నమచంద్రుని వెన్నలహాయి, వారినో నూతన ప్రపంచంలోకి లాక్కొని వెళ్ళాయి. అంతులేని ఆలోచనలతో బుర్రగిర్రున తిరిగింది. మైమరపించే మధుర వాంచలెన్నో వారిలో బయలుదేరాయి. మోహన్ ఆమె కోమలహస్తాల్ని పట్టుకొని తన కౌగిటిలో అల్లుకొన్నాడు. కమల! అబల, ఏం చేస్తుంది—మోహనుని బిగి కౌగిటిలో నలిగిపోయింది. మోహన్ ఆమె మృదువైన శరీరాన్ని తనివితీర అనుభవించాడు. ఆమె కన్యత్వాన్ని దొంగలా దోచుకున్నాడు.

మోహన్ చేసిన బుద్ధితక్కువకి "కమల" ఎంతోసేపు దుఃఖించింది. కాని మోహన్ తన కేలాంటి ద్రోహంచెయ్యడనే పిచ్చి నమ్మిక ఆమెను వోదార్చింది. "నిన్ను తప్ప మరెవ్వరిని పెళ్లి జేసుకో"నని మోహన్ మళ్లీ వాగ్దానంచేసాడు. ఆనాటి పొరపాటుకి ప్రతిఫలంగా "కమల" గర్భవతి అయింది. నేను గర్భవతినయ్యానని కమల చెప్పగానే మోహనునికి ఆమెపై మోజు కాస్త తగ్గిపోయింది. ఏలాగైనా యీ పీడను వదిలించుకొని బయటపడాలనుకున్నాడు. కమల పెళ్లి తొందరగా జరగాలి అని బలవంత పెట్టగానే, ఇంటినుండి కొంతడబ్బు తీసుకొని ఎక్కడికో పారిపోయాడా ప్రేమ ద్రోహి.

మోహన్ తన కీలాంటి ద్రోహం చేస్తాడని స్వప్నంలోనైనా అనుకోని కమలకు మోహనుడు ఎక్కడికో పారిపోయాడని తెలియగానే, మొదలు నరికిన అరటి చెట్టులా నేలమీద పడి బోరుమంటూ యేడ్చింది.

రోజులు గడిచాయి. కమల గర్భవతి అయిన సంగతి అందరికి తెలిసిపోయింది. కులంవారు కోటయ్య కుటుంబాన్ని బహిష్కరించారు.

నా యీ దురవస్థకి కారకుడు మోహన్. నమ్మించినందుకు మోసపోయాను. నేను నిర్దోషురాలను, అంటూ మొర పెట్టుకుంది కమల.

"నీవు వ్యభిచారిణివి!" అన్నారు సంఘాధికారులు, "నీవు కులటవు!" అన్నారు కులంపెద్దలు, "నీవు రంగుపిల్లవని" రౌడీలు రాళ్ళు విసరారు. "పాపమేలా దాగుతుందని!" పతివ్రతలు పళ్లు కొరికారు. కాని, న్యాయాన్యాయాలు యెవరు విచారించలేదు.

అనాథులకు నీవే బాంధవుడవంటూ ఆలయంలోని రాతిబొమ్మను ప్రార్థించింది, కమల. యథాప్రకారం చిరునవ్వును ప్రకటిస్తూనే వుందా రాతివిగ్రహం, వినిపించుకోనట్టు.

"నీవుకూడా నా దురవస్థను చూచి నవ్వుతున్నావా?" అంటూ ఆలయం గనముపై తల బ్రద్దలయ్యేటట్టు కొట్టుకొని ప్రాణత్యాగం చేసుకుంది కమల – సంఘం ఆమె శవాన్ని చూసి సంతోషించింది,

శక్తిమయి

శరీరము అనేక కారణాలవల్ల నీరశించిపోతుంది. వెంటనే తగిన శ్రద్ధ తీసుకుంటే కొరవడ్డబలం తిరుగా కలిసివస్తుంది అందువల్ల యేమాత్రం నీరసము, అలసట కనుపించినా వెంటనే 'శక్తిమయి'ని వాడాలి. ఒకేఒకడబ్బావాడితే నిస్సత్తువ అంతాపోయి. మంచి బలము, ఉత్సాహము కలుగుతుంది. రక్తవృద్ధి, మంచి వర్చస్సు అలవడుతుంది. శక్తిమయి 20 రోజుల మందు 3 రూపాయలు. 40 రోజులమందు రు. 5-0-0 60 రోజులకు రు. 7-0-0 పోస్టేజి 12 అణాలు. కేటలాగు వుచితము.

సూరజ్ ఫార్మసీ

110, టి. హెచ్ రోడ్, వాషర్‌మన్‌పేట మద్రాస్.